24-10-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - తండ్రికి సహాయకులుగా అయి అందరి చేత కొత్త ప్రపంచం యొక్క పురుషార్థము చేయించండి - ఏ విధంగానైతే స్వయం జ్ఞాన సంపన్నులుగా అయ్యారో, అదే విధంగా ఇతరులను కూడా తయారుచేస్తూ ఉండండి"

ప్రశ్న:- పిల్లలైన మీరు ఇప్పుడు ఏ స్మృతిలో ఉండాలి? స్మృతి యొక్క అద్భుతము ఏమిటి?

జవాబు:- మీకు ఇప్పుడు బీజము మరియు వృక్షము యొక్క జ్ఞానము ఏదైతే లభించిందో, ఆ జ్ఞానం యొక్క స్మృతిలో ఉండాలి. ఈ స్మృతి ద్వారా మీరు చక్రవర్తీ రాజాగా అవుతారు - ఇదే స్మృతి యొక్క అద్భుతము. తండ్రి పిల్లలకు స్మృతినిప్పిస్తారు - పిల్లలూ, మీరు అర్థకల్పం చాలా భక్తి చేసారని స్మృతి కలిగింది. ఇప్పుడు నేను మీకు భక్తి యొక్క ఫలాన్ని ఇవ్వడానికి వచ్చాను. మీరు మళ్ళీ వైకుంఠానికి యజమానులుగా అవుతారు. తండ్రి ఏ విధంగా మధురమైనవారో - అదే విధంగా తండ్రి యొక్క జ్ఞానము కూడా మధురమైనది, దానిని స్మరణ చేసి స్మరిస్తూ-స్మరిస్తూ సుఖాన్ని పొందాలి.

గీతము:- మేల్కోండి ప్రేయసులారా మేల్కోండి....(జాగ్ సజనియా జాగ్...)

ఓంశాంతి. మధురాతి-మధురమైన పిల్లలు పాటను విన్నారు. ఈ రోజు దీపావళి. దీపావళి అని కొత్త యుగాన్ని అంటారు. సత్యయుగంలో దీపావళి ఏమీ జరుపుకోబడదు ఎందుకంటే అక్కడ అందరి ఆత్మ రూపీ జ్యోతి వెలిగి ఉంటుంది. పిల్లలకు తెలుసు, మనం శ్రీమతముపై కొత్త ప్రపంచంలో రాజ్య భాగ్యం తీసుకునే పురుషార్థము చేస్తున్నాము. మీరు ఇప్పుడు త్రికాలదర్శిగా అయ్యారు. త్రికాలదర్శి అని భూత, భవిష్యత్తు, వర్తమానాల గురించి తెలిసినవారిని అంటారు. ఇప్పుడు మీకు మూడు కాలాల జ్ఞానము ఉంది. కావున మీరు ఇతరులకు కూడా అర్థం చేయించాలి. స్వయము కూడా ముళ్ళ నుండి పుష్పాలుగా అవుతారు, ఇతరులను కూడా తయారుచేయాలి. గతం యొక్క చరిత్ర-భౌగోళికాల గురించి తెలుసుకోవడం ద్వారా భవిష్యత్తు ఏమి జరగబోతుంది, అది కూడా తెలుసుకుంటారు. భవిష్యత్తును తెలుసుకోవడం ద్వారా గతాన్ని, వర్తమానాన్ని కూడా తెలుసుకుంటారు - దీనినే జ్ఞాన సంపన్నులుగా అవ్వడము అని అంటారు. గతము కలియుగము, వర్తమానము సంగమయుగము, మళ్ళీ భవిష్యత్తులో సత్య, త్రేతా యుగాలు రానున్నాయి. కావున పిల్లలైన మీరు ఈ చక్రాన్ని తెలుసుకున్నారు మరియు కొత్త ప్రపంచంలోకి వెళ్ళేందుకు పురుషార్థం చేస్తున్నారు మరియు బాబాకు సహాయకులుగా అయి ఇతరుల చేత కూడా పురుషార్థం చేయించడంలో నిమగ్నమై ఉన్నారు. తండ్రి చాలాకాలం తర్వాత విడిపోయి కలిశారు మరియు మీరు కూడా చాలాకాలం తర్వాత విడిపోయి కలిశారు ఎందుకంటే 5,000 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. కనుక తండ్రి ప్రేయసులను అలంకరించి కొత్త ప్రపంచంలోకి తీసుకువెళ్ళేందుకు వచ్చారు. పిల్లల బుద్ధిలో పై నుండి కింది వరకు మూలవతనము, సూక్ష్మవతనము యొక్క జ్ఞానము ఉంది. ఏ-ఏ ధర్మ స్థాపకులు ఎప్పుడు మరియు ఎలా పై నుండి వచ్చి ధర్మ స్థాపనను చేస్తారో పిల్లలకు తెలుసు. తండ్రి మిమ్మల్ని నాలెడ్జ్ ఫుల్ గా చేసారు. వారిని అతి ప్రియమైనవారు అని అంటారు. వారు మధురాతి-మధురమైనవారు. వారు ఎంత మధురమైనవారో మీకు తెలుసు. వారి మహిమ అపారమైనది, అలాగే వారి వారసత్వం యొక్క మహిమ కూడా అపారమైనది. దాని పేరే ఉంది స్వర్గము, హెవెన్, ప్యారడైజ్, బహిష్త్. పరమాత్మను గాడ్ ఫాదర్, దుఃఖహర్త, సుఖకర్త అని అంటారు. మరి వారిని ఎంతగా స్మృతి చేయాలి. కానీ డ్రామానుసారముగా స్మృతి కలగదు. ఈ పాట ఎంత బాగుంది. ఇంట్లో 3-4 పాటలు తప్పకుండా ఉండాలి. ఈ పాటలు కూడా తండ్రి స్మృతినిప్పిస్తాయి. కొత్త దైవీ ప్రపంచపు, స్వరాజ్యము అనగా ఆత్మకు ఇప్పుడు రాజ్యము లభిస్తుందని బ్రాహ్మణులకే తెలుసు. లౌకిక తండ్రి ద్వారా ఏ వారసత్వమైతే లభిస్తుందో, దానిని పరమాత్మ ద్వారా లభించిందని అనరు. మీకు తెలుసు, తండ్రి నుండి రాజ్యం తీసుకున్నాము, మళ్ళీ పోగొట్టుకున్నాము. ఇప్పుడు మళ్ళీ తీసుకుంటున్నాము. సత్యయుగములో తెల్లగా ఉండేవారము, మళ్ళీ నల్లగా అయ్యాము. శ్యామ సుందరుడు అని పాడుతారు కూడా. నల్లగా ఉండేవారు - ఇప్పుడు సుందరముగా అయ్యేందుకు సద్గురువు లభించారు. ఇప్పుడు సద్గురువు మరియు గోవిందుడు ఇరువురు నిలబడి ఉన్నారు. మళ్ళీ, గురువైన మీపై బలిహారము... అని అంటారు. మీరు శ్రీకృష్ణునిగా అవుతున్నారు. బలిహారము పిల్లలైన మీది, మీరు ఈ విధంగా తయారవుతున్నారు. శ్రీకృష్ణుడు గోవులను చూసుకునేవారని అంటారు. మళ్ళీ బ్రహ్మ కోసం కూడా, వారికి గోశాల ఉండేదని అంటారు. గోశాల శ్రీకృష్ణునిది కాదు, బ్రహ్మది కాదు. గోశాల శివబాబాది.

ఇప్పుడు పిల్లలైన మీరు పండుగల రహస్యాన్ని కూడా అర్థం చేసుకున్నారు. దీపావళి సత్యయుగములో ఉంటుందని

మీకు తెలుసు. అక్కడ జ్యోతి వెలిగి ఉంటుంది. మీకు 21 జన్మలు దీపావళి ఉంటుంది. ఇక్కడ ప్రతి సంవత్సరము జరుపుకుంటారు. ఈ రోజు జరుపుకుంటారు, రేపు దీపం ఆరిపోతుంది. ఒకవేళ సత్యయుగములో జరుపుకుంటే కూడా పట్టాభిషేకం జరుపుకుంటారు, ఆ రోజున బాణాసంచా కాలుస్తారు. ఇక్కడైతే పైసాకు విలువ చేసే బాణాసంచాను కాలుస్తారు, దాని వలన చాలా ప్రమాదాలు జరుగుతాయి. అక్కడైతే పెద్ద పట్టాభిషేకం జరుగుతుంది. ఇక్కడ రాజ్యము లభిస్తే ప్రతి సంవత్సరము జరుపుకుంటారు. కానీ ఈ రాజ్యంలో సుఖం లేదు. ఇది భ్రష్టాచారీ ప్రపంచము, అది శ్రేష్ఠాచారీ ప్రపంచము. తండ్రి అంటారు, చూడండి, మిమ్మల్ని ఎంత తెలివైనవారిగా తయారుచేస్తాను. తండ్రిని త్రిలోకనాథుడు అని అంటారు. వారు త్రిలోకాలకు యజమానిగా అవ్వరు. వారిలో జ్ఞానము ఉంది. మిమ్మల్ని వైకుంఠానికి యజమానులుగా చేస్తారు. మీకు ఎంతటి సంతోషము ఉండాలి. అర్ధకల్పం మీరు భక్తి చేసారు, ఇప్పుడు తండ్రి లభించారు. తండ్రి ఇప్పుడు స్మృతినిప్పిస్తారు – స్మృతి చేయండి, స్మృతి చేయండి... అని అంటారు. ఎవరిని? తండ్రిని మరియు తండ్రి రచన యొక్క జ్ఞానాన్ని స్మృతి చేయాలి. బీజము మరియు వృక్షాన్ని స్మృతి చేయాలి. ఈ స్మృతి ద్వారా మీరు చక్రవర్తీ రాజాగా అవుతారు. స్మృతి యొక్క అద్భుతాన్ని చూసారా, ఎలా ఉన్నవారిని ఎలా తయారుచేస్తుంది. దీనిని ఆధ్యాత్మిక జ్ఞానము అని అంటారు. ఆత్మ యొక్క తండ్రి ఎవరైతే ఉన్నారో, వారు జ్ఞానాన్ని వినిపిస్తారు. గీతలో శ్రీకృష్ణుని పేరును రాసారు. కానీ తండ్రి మీకు జ్ఞానాన్ని ఇచ్చి తమకన్నా కూడా ఉన్నతంగా చేస్తారు. మీరు వైకుంఠానికి యజమానులుగా అవుతారు. ఎలాగైతే వారు చదువును చదువుకుంటున్నప్పుడు మేము బ్యారిస్టర్ గా అవుతామని బుద్ధిలో ఉంటుంది. మనం నిరుపేద నుండి రాకుమారులుగా అవుతామని మీకు తెలుసు. ఆ తర్వాత మహారాజుగా అవుతాము. ఇప్పుడు తండ్రి టీచర్ రూపంలో చదివిస్తున్నారు. లౌకికములో కొడుకు 5 సంవత్సరాలు తండ్రి వద్ద ఉంటాడు, ఆ తర్వాత టీచర్ వద్దకు వెళ్తాడు, వృద్ధాప్యంలో మళ్ళీ గురువును ఆశ్రయిస్తాడు. ఇక్కడైతే తండ్రికి చెందినవారిగా అయ్యారు మరియు తండ్రి, టీచర్ రూపంలో శిక్షణనిస్తారు మరియు సద్గతి కోసం తోడుగా తీసుకొని వెళ్తారు. ఆ గురువులు తోడుగా తీసుకొని వెళ్ళరు. స్వయము వారే ముక్తిలోకి వెళ్ళరు. వారు యాత్రలకు తీసుకొని వెళ్తారు, మీరు కూడా పండాలు, వారు కూడా పండాలు. కానీ అది గవ్వల వంటి యాత్ర. ఈ జ్ఞానము మీకు ఉంది. మీకు సంతోషము ఉండాలి. ఇది విద్యార్థి జీవితము, మరి ఎందుకు మర్చిపోవాలి. కానీ మాయ ఆ సంతోషం ఉండనివ్వదు ఎందుకంటే కర్మాతీత అవస్థ అంతిమంలో వస్తుంది. స్మృతిర్లబ్ధ అని అంటారు కదా. స్మరిస్తూ-స్మరిస్తూ సుఖాన్ని పొందండి, అక్కడ దుఃఖం ఉండదు. జీవన్ముక్తి అని అంటారు. తండ్రి ఎలాగైతే మధురమైనవారో, అలాగే తండ్రి యొక్క జ్ఞానము మధురమైనది. బాబా మహిమ అపారమైనది అనగా దాని అంతాన్ని తెలుసుకోలేరు. ఈ విధంగా భక్తిలో అంటారు. మీరు ఈ విధంగా అనలేరు ఎందుకంటే మీకు మొత్తం జ్ఞానం లభించి ఉంది. మీరు చాలా మధురముగా అవ్వాలి. స్వయాన్ని చూసుకోండి, నాలో ఏ వికారమైతే లేదు కదా? ఎవరి అవగుణాలను చూడడం లేదు కదా? చాలా మధురమైన దృష్టిని ఉంచుకోవాలి. బాబాకు ఎంతమంది పిల్లలున్నారు. అందరిపైన మధురమైన దృష్టి ఉంది కదా. మీరు కూడా ఇలాగే ఉంచుకోవాలి. రాధే-కృష్ణులు, లక్ష్మీ-నారాయణులకు ఏం సంబంధము ఉంది అన్నది మనుష్యులకు తెలియదు, అందుకే చిత్రాలను కూడా తయారుచేసారు. బాల్యములో రాధే-కృష్ణులు స్వయంవరం తర్వాత లక్ష్మీ-నారాయణులుగా అవుతారు. తండ్రి వచ్చి స్మృతినిప్పిస్తున్నారు, పిల్లలూ, మీరు దేవతలుగా ఉండేవారు. పిల్లలు అంటారు, తప్పకుండా అలా ఉండేవారము. బ్రాహ్మణ దేవీ-దేవతాయ నమః అని అంటారు, బ్రాహ్మణులు అలా అంటారు కానీ బ్రాహ్మణ, దేవత, క్షత్రియ మూడు ధర్మాలను స్థాపన చేస్తారని వారికి తెలియదు. కావున బ్రాహ్మణులకు తండ్రి - బ్రహ్మ మరియు శివ. తండ్రి సాధారణ రూపంలో వస్తారు. ఈ రథము నిశ్చితమై ఉంది, ఇది భాగ్యశాలి రథము.

మనుష్యులు దీపావళి రోజున లక్ష్మి నుండి ధనం యాచించేందుకు ఆహ్వానిస్తారు. ఇంతకుముందు మీరు కూడా యాచించేవారు. ఇప్పుడు మీరు లక్ష్మీ-నారాయణులుగా అవుతున్నారు. ఇక్కడైతే భిక్షను యాచిస్తూ ఉంటారు. పుత్రుడిని ఇవ్వండి, ధనము ఇవ్వండి అని మొర పెట్టుకుంటారు. సత్యయుగములో ఇలా యాచించరు. శివబాబా పిల్లల యొక్క అన్ని భండారాలను నిండుగా చేసేస్తారు. తండ్రి అయితే స్వర్గాన్ని రచిస్తారు - నరకాన్ని ఏమైనా రచిస్తారా. ఇప్పుడు బాబా స్వర్గవాసులుగా చేసేందుకు నరకంలోకి వచ్చారు. అందరూ పతితులుగా ఉన్నారు, మేము నరకవాసులము అన్నది వారికి తెలియదు. ఎవరైతే స్వర్గవాసులుగా ఉండేవారో, వారు ఇప్పుడు నరకవాసులుగా అయ్యారు. ఇప్పుడు మళ్ళీ స్వర్గవాసులుగా అవుతున్నారు. ఈ బ్రహ్మ శివబాబా యొక్క అకాల సింహాసనము, వీరిలో అకాలమూర్తి అయిన పరమాత్మ వచ్చి కూర్చుంటారు. ఆత్మ కూడా అకాలమూర్తి. ఈ భృకుటి ఆత్మ యొక్క సింహాసనము. దానికి గుర్తుగా మస్తకముపై తిలకము దిద్దుతారు. ఈ రోజుల్లో ఎద్దుకు కూడా తిలకము దిద్దుతారు. కావున ఈ భృకుటి బ్రహ్మ మరియు శివబాబా, ఇరువురికీ ఆసనము. నేను వచ్చి జ్ఞానాన్ని ఇస్తాను, నాలెడ్జ్ ఫుల్ ను. నాకేమీ అందరి హృదయాల గురించి తెలియదు, థాట్ రీడర్ ను కాను. అయితే, నన్ను హృదయానికి యజమాని అని

అనవచ్చు ఎందుకంటే ఆత్మనే హృదయము అని అంటారు. కావున నేను ఆత్మకు యజమానిని, శరీరానికి యజమానిని కాను. నేను యజమానిని అని సాధువులు ఈ విధంగా అంటారు కదా. కావున నేను అవినాశీ ఆత్మకు యజమానిని ఎందుకంటే నేను స్వయం అవినాశిని. మీరు వినాశీ వస్తువులకు యజమానులుగా అవుతారు ఎందుకంటే మీరు ఒక వినాశీ శరీరాన్ని వదిలి మరొకదానిని తీసుకుంటారు. మీరిప్పుడు వైకుంఠములోకి వెళ్తారు, అందుకే చదువును చదువుతున్నారు. ఎప్పటివరకైతే జీవించాలో అప్పటివరకు తాగాలి అని అంటారు కదా. ఎప్పుడైతే చదువు పూర్తవుతుందో, అప్పుడు ఈ శరీరమే వదిలిపోతుంది. సృష్టిని రచించేందుకు వెళ్ళాలి అని పరమాత్మకు సంకల్పము కలిగిందని అంటారు. ఎప్పుడైతే సమయం వస్తుందో, అప్పుడే పాత్రను అభినయించే సంకల్పము కలుగుతుంది మరియు వచ్చి పాత్రను అభినయిస్తారు. తండ్రి అంటారు, ఏ విధంగా మీరు పాత్రను అభినయిస్తారో, అలాగే నేను కూడా అభినయిస్తాను. ఇకపోతే, నేను జనన-మరణాలలోకి రాను, అందుకే నాకు ఎంత మహిమ ఉంది. వైకుంఠానికి కూడా మహిమ ఉంది. సన్యాసులకు సత్యయుగం యొక్క సుఖాల గురించి తెలియదు. అక్కడి సుఖాలు వారికి లభించేదే లేదు. సత్యయుగం కోసం కూడా, అక్కడ కంసుడు ఉండేవారని వారు విన్నారు కదా. కావున అక్కడ కూడా సుఖము ఉండేది కాదని భావిస్తారు. కాకి రెట్టతో సమానమైన సుఖము ఉంటుందని ఇతరులకు కూడా అలాగే వినిపిస్తారు. అలా వినిపించి ఇతరుల చేత కూడా సన్యాసము చేయిస్తారు. పిల్లలైన మీరైతే స్వర్గం యొక్క సుఖాలను పొందుతారు. ఇదైతే అంతిమ జన్మ. అందరూ మరణిస్తారు కూడా. నేను తీసుకువెళ్ళేందుకే వచ్చాను, మరి మీరు ఇక్కడే కూర్చొని ఉంటారా. దోమల గుంపు వలె అందరినీ తీసుకువెళ్తాను. కావున మమ్మా, బాబా వలె పురుషార్థము చేసి పదవిని తీసుకోవాలి. మీరు బ్రహ్మ ముఖ వంశావళి కదా. సత్య, త్రేతాయుగాలలో దేవతలు ఎంతమంది ఉంటారో, అంతమందే ఇప్పుడు బ్రహ్మ ముఖ వంశావళిగా అవ్వనున్నారు. కావున నియమానుసారముగా తల్లి తండ్రులు కూడా ఉన్నారు, మళ్ళీ సంభాళించేందుకు ఎవరో ఒకరిని నిమిత్తం చేయడం జరుగుతుంది. కొత్త-కొత్త పిల్లలు వస్తూ ఉంటారు, చదువు కొనసాగుతూ ఉంటుంది. చివరివరకు వృద్ధిని పొందుతూ ఉంటారు. పాలన చాలా మంచిగా చేయాలి. వారు తోట యజమాని. సెంటర్లలో ఉండే మీరు తోటమాలులు. తోటమాలి అయితే మొక్కలను సంభాళించాలి. తోటమాలులే సరిగ్గా లేకపోతే వారు మొక్కలను ఏం సంభాళిస్తారు. ఏ తోటమాలి అయితే మంచి-మంచి తోటలను తయారుచేస్తారో, వారిని చూసి తోట యజమాని చాలా సంతోషిస్తారు. ఎవరెవరు చాలా మంచి తోటలను తయారుచేసారు అని చూసేందుకు మళ్ళీ తోట యజమాని వెళ్తారు. ఎవరెవరు మంచి తోటమాలులు అన్నది మీకు కూడా తెలుసు. ఎవరైతే మంచి-మంచి తోటమాలులో, వారికి బహుమతి కూడా లభిస్తుంది. తోటమాలులైన మీకు జీతము పెరుగుతూ ఉంటుంది.

ఇప్పుడు పిల్లలైన మీరు మీ గమ్యాన్ని స్మృతి చేయాలి ఎందుకంటే మీరిప్పుడు తిరిగి ఇంటికి వెళ్ళాలి, కావున ఇంటిని స్మృతి చేయవలసి ఉంటుంది. స్మృతి చేయకుండా శాంతిధామంలోకి వెళ్ళలేరు. లేదంటే చాలా శిక్షలు అనుభవించవలసి ఉంటుంది, పదవి కూడా మంచిది పొందలేరు. ఈ సమయంలో ఎవరైతే సూక్ష్మవతనానికి వెళ్తారో, సేవార్థము వెళ్తారు. మొదటి నంబరులో బాబా సేవ చేస్తారు, రెండవ నంబరులో మమ్మా ఉన్నారు ఎందుకంటే మమ్మా రెండవ నంబరులోకి రావాలి. కావున పిల్లలైన మీరు కూడా మమ్మా, బాబాలను ఫాలో చేయాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. తండ్రి సమానముగా చాలా మధురముగా అవ్వాలి. అందరినీ మధురమైన దృష్టితో చూడాలి. ఎవరి అవగుణాలను చూడకూడదు.

2. ఈశ్వరీయ విద్యార్థి జీవితం యొక్క సంతోషములో ఉండాలి. ఎప్పటివరకైతే జీవించాలో అప్పటివరకు చదువును రోజు చదవాలి.

వరదానము:- తపన అనే అగ్ని ద్వారా ఒక దీపముతో అనేక దీపాలను వెలిగించి సత్యమైన దీపావళిని జరుపుకునే కుల దీపక భవ

ఆత్మ రూపీ దీపాలైన మీ యొక్క తపనను ఒక్క దీపరాజు అయిన తండ్రితో పెట్టుకోవడమే సత్యమైన దీపావళి. ఎలాగైతే దీపంలో అగ్ని ఉంటుందో, అలాగే దీపాలైన మీలో తపన అనే అగ్ని ఉంది, దీని ద్వారా అజ్ఞానమనే అంధకారము దూరమవుతుంది. మనుష్యులైతే దీపావళి నాడు స్థూలమైన మట్టి దీపాలను

వెలిగిస్తారు కానీ మీరు చైతన్యమైన దీపాలు, కుల దీపకులు మరియు బాప్ దాదా యొక్క ఆశా దీపాలు. మీ ఏకరస, స్థిరమైన, చలించని వెలుగుతున్న దీపంతో అనేక దీపాలు వెలిగినప్పుడు సత్యమైన దీపావళి జరుగుతుంది.

స్లోగన్:- సమయం యొక్క మహత్వాన్ని తెలుసుకున్నట్లయితే సర్వ ప్రాప్తుల ఖజానాలతో సంపన్నంగా అయిపోతారు.